క్లుప్తంగా

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు


గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమైన దృశ్యం

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవల రేవు నుంచి కొండాలమ్మ గుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలా చోట్ల కుంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుగుండా నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా వారిన్గ్ వాక్ చేసే వారు. సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టి పెట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ పోడియంల తొలగింపు


ఆచంట సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో పోడియం తొలగిస్తున్న దృశ్యం

పెనుగొండ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌కు పోడియం తొలగించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం పోడియం తొలగింపు పనులు ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వచ్చేలా చేసే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సామాన్యులకు సమాన గౌరవం ఉండేందుకు, బ్రిటీష్ కాలం నాటి ఆనవాయితీలకు స్వస్తి పలకాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో వీటిని తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకొస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు హామీ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఏపీ మెడికల్ కార్పొరేషన్ ఈఈ బీవీ గిరి, డీఈ ఎం.శ్రీనివాసరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్, జీవీ, పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న శ్రీ యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. పట్టణంలో శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రూ.1000 నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం, దుస్తులు అందజేశారు. అలాగే యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ కన్వీనర్ ఆవాల పెద్దిరాజు లైబ్రరీ సైన్స్‌లో డాక్టరేట్ సాధించిన సందర్భంగా కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, ఎం.శివ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వారధి వెంకటరమణ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిట్టీ నిర్వాహకురాలిపై కేసు నమోదు

పాలకోడేరు: మా వద్ద నుంచి చిట్టీలు కట్టించుకొని, మా సొమ్ము ఇవ్వకుండా ఎగవేసిందంటూ కొంత మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేండ్ర గ్రామానికి చెందిన చీర వెంకట రమణ అనే మహిళపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన ఇది. ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. వేండ్ర గ్రామానికి చెందిన వెంకట రమణ చుట్టు పక్కల గ్రామాల ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, గత కొన్ని ఏళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. ఇటీవల కాలంలో పాట సొమ్ము సరిపెట్టకుండా సాకులు చెబుతున్నారని వేండ్ర గ్రామానికి చెందిన మందపాటి రామరాజు, మరో వందమంది కలిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.హరిబాబు తెలిపారు.

బైబై గణేశా..!

- వైభవోపేతంగా వినాయకుడి నిమజ్జనాలు
- పలు చోట్ల లడ్డూ ప్రసాదాలు వేలం

పెనుగొండ: గణపతి నవరాత్రులు పూర్తి కావడంతో గ్రామాల్లో నిమజ్జనాలు జోరందుకొన్నాయి. తొమ్మిది రోజులు పూజలందుకొన్న గణనాథుడు పదో రోజు సోమవారం చలువ పందిళ్ల నుంచి ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. బూరుగులంకలో నిమజ్జనోత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఏకంగా విశాఖపట్నం నుంచి తీసుకొచ్చిన సాంప్రదాయ కోలాట భజన ఆకట్టుకొంది. గ్రామంలో అన్ని వీధుల్లోనూ ప్రత్యేక దుస్తులు ధరించిన మహిళలు కలశాలు నెత్తినెట్టుకొని కోలాటం చేస్తూ ఉత్సవంలో పాల్గొనడం ఆసక్తికరం. వీరిని తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. బేతాళ నత్యాలు ఆకట్టుకొన్నాయి. సిద్ధాంతంలో ఘటాల దిబ్బ లక్ష్మీగణేష్ యూత్, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో గణపతి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం సిద్ధాంతం వశిష్టా గోదావరిలో నిమజ్జనం చేశారు.

కరుగోరుమిల్లిలో

ఆచంట మండలంలో గణేష్ నిమజ్జనాలు జోరుగా నిర్వహిస్తున్నారు. సోమవారం కరుగోరుమిల్లి, కోడేరు, పెదమల్లంల్లో నిమజ్జనానాలు నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం వశిష్ట గోదావరిలో గణపతి నిమజ్జనం చేశారు.

లడ్డూ వేలం

వినాయక చవితికి వినాయకునికి నైవేద్యం సమర్పించిన లడ్డూకు క్రేజ్ నానాటికీ పెరుగుతుంది. తెలంగాణలో గత కొన్ని దశాబ్ధాలుగా లడ్డూ వేలానికి క్రేజ్ ఉంటే, అది నెమ్మదిగా ఉభయ గోదావరి జిల్లాలకు పాకింది. తెలంగాణలో ఇటీవలే లడ్డూ ఏకంగా రూ.29 లక్షలకు పైగా వెళితే, ఉభయ గోదావరి జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లోనూ లక్షల్లో లడ్డూ వేలం పలుకుతుంది. ఆచంట మండలం కరుగోరుమిల్లి శివారు ముత్యాలవారి పాలెంలో విజయ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంలో కంచుస్థంభపాలేనికి చెందిన యాతం నాగరాజు, హైమా సూర్యవతి దంపతులు వేలంలో పాల్గొని రూ.1.35 లక్షలకు దక్కించుకొన్నారు. ఆచంట మండలంలో ఇదే రికార్డు స్థాయి వేలం కావడం విశేషం. ఇదే పరిస్థితి ఇతర గ్రామాల్లోనూ ఉంది. ఆచంట వేమవరం, కందరవల్లి గ్రామాల్లోనూ లక్షకు పైగా లడ్డూ ధర పలికింది. పెనుగొండలో గాంధీ బొమ్మల సెంటర్‌లో రూ.37 వేలకు లడ్డూ వేలం పాడారు. చిన్న కమిటీల ఆధ్వర్యంలో జరిగే చవితి వేడుకల్లోనూ లడ్డూ వేలానికి ప్రత్యేక స్థానం ఏర్పడుతుంది. రూ.8 వేల నుంచి 30 వేల వరకూ వేలం వెళుతుంది. వేలంలో వచ్చిన నగదును నిమజ్జనం రోజు గ్రామోత్సవంలోనూ, అన్న సమారాధనలో ఖర్చు చేస్తుంటారు.

మొగల్తూరు: వినాయక చవతి మహోత్సవాలును ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పలు ప్రాంతాల్లో నిలబెట్టిన వినాయకుడి విగ్రహాలను సోమవారం ఊరేగించారు. శక్తి వేషధారణలు, తీన్ మారు డప్పులు, విచిత్ర వేషధారణలు, యువతీ, యువకుల నృత్యాలతో బాణ సంచా కాలుస్తూ స్వామి వారిని ఊరేగించి, నిమజ్జనం చేశారు.

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులను మేళతాళాలతో గణపతి బప్పా మోరియా అంటూ అత్యంత వైభవంగా ఊరేగించి, నిమజ్జనం చేశారు. ఆదివారం నాటికి గణనాథుడు తొమ్మిది రాత్రులు పూజలందుకోవడంతో సోమవారం స్వస్తి పలికి స్వామిని నిమజ్జనం చేశారు. పట్టణ పుర వీధుల్లో ఊరేగించిన గణనాథులను కొందరు పట్టణంలోని ప్రధాన కాలువలో నిమజ్జనం చేయగా మరి కొందరు ఉత్సవ కమిటీల నిర్వాహకులు నర్సాపురం, చించినాడ గోదావరిలో నిమజ్జనం చేశారు.

ముగింపు వేడుకలు

నరసాపురం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కొప్పర్రు పెద్ద వీధిలో మట్టితో ఏర్పాటు చేసిన వినాయకుడు, హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు సోమవారం నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కోవెల గుడి వద్ద ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహం వద్ద నిత్యం భక్తి పరమైన భజనలు, కీర్తనలు, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు శివాలయం వద్ద గల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 18 కిలోల లడ్డూని సోమవారం వేలం నిర్వహించగా ఎంఈవో ఆర్ఎస్‌వీఎస్ గంగాధర శర్మ రూ.54 వేలకు దక్కించుకున్నారు. అదే విధంగా మహిళలకు నిర్వహించిన కోవా లడ్డూని చెరుకూరి వైష్ణవి రూ.20 వేలకు దక్కించుకున్నారు. అర్చక స్వాములు చంటి, శివబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు మురళీ కృష్ణంరాజు, రౌతు కృష్ణ, వెంకటపతిరాజు, సత్యనారాయణ, ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించి, వశిష్ట గోదావరిలో నిమజ్జనం చేశారు.


పెనుగొండ: సిద్ధాంతంలో గణేష్ నిమజ్జనంలో ఆకట్టుకున్న బేతాళ నత్యాలు


పాలకొల్లు అర్బన్: వేలంలో లడ్డూ దక్కించుకున్న ఎంఈవో ఆర్ఎస్‌వీఎస్ గంగాధరశర్మ


మొగల్తూరు: శక్తి వేషాలతో వినాయకుడి ఊరేగింపు


పెనుగొండ: గాంధీబొమ్మల సెంటర్‌లో గ్రామోత్సవం


నరసాపురం రూరల్: కొప్పర్రులో గణపతి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డుపైనే భారీ వాహనాల పార్కింగ్


జాతీయ రహదారికి ఇరువైపులా నిలుపుదల చేసిన భారీ వాహనాలు

ప్రయాణికుల ఇక్కట్లు

నరసాపురం: పట్టణంలో ఓఎన్జీసీ టెంపుల్ ల్యాండ్ వద్ద జాతీయ రహదారి బక్కచిక్కపోయి కనిపిస్తోంది. 216 జాతీయ రహదారికి ఇరువైపులా ఓఎన్జీసీకి చెందిన భారీ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో ప్రయాణీకులు ఇక్కట్లు పడుతున్నారు. జాతీయరహదారి పక్కన రుస్తుంబాధ ప్రాంతంలో ఓఎన్జీసీ టెంపుల్‌ల్యాండ్ కార్యాలయం ఉంది. ఓఎన్జీసీకి సంబంధించిన సరుకుల రవాణా ప్రతీ రోజు ఇక్కడకు భారీ వాహనాలతో సాగుతుంది. అయితే వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పోలీస్‌శాఖ దృష్టి పెట్టి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

పశువుల దాణా పంపిణీ


పశువుల దాణా పంపిణీ చేస్తున్న పశు సంవర్థక శాఖ అధికారులు

యలమంచిలి: వరద ప్రభావిత గ్రామలైన కనకాయలంక, పెదలంకల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు సోమవారం 20 టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్) పంపిణీ చేశారు. కనకాయలంకలో 117 మంది రైతులకు 480 బస్తాలు (12 టన్నులు), పెదలంకలో 45 మంది రైతులకు 320 బస్తాలు (8 టన్నులు) పంపిణీ చేశారు. కార్యక్రమములో కనకాయలంక పెదలంక సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు పశు సంవర్ధక శాఖ పాలకొల్లు డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ జి.మల్లేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి స్థానిక నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, కొడవటి వరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చెప్పినా.. పట్టించుకోవడం లేదు


అధికారులకు చేసిన ఫిర్యాదులను చూపుతున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు గట్టుపై శ్రీ రాజ రాజేశ్వరి ఆలయ గోపుర నిర్మాణం గురించి కలెక్టర్ చదలవాడ నాగరాణి విచారణకు ఆదేశించినా దిగువ స్థాయి ఉద్యోగులు పట్టించుకోవడం లేదని బాధితులు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మణిరత్నమాల దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ ఇంటికి ఎదురుగా రక్షిత మంచి నీటి చెరువు గట్టుపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ గోపుర నిర్మాణంపై రెండు వారాల కలెక్టర్ నాగరాణిని కలిసి సమస్యను వివరించామన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ వివాదస్పద ఆలయ నిర్మాణంపై హైకోర్టులో కేసు విచారణలో ఉన్నా ఆలయంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్బీచర్లలో పోలీస్ పికెట్


మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ దుర్గా ప్రసాద్.

నరసాపురం రూరల్: వినాయక నిమజ్జనం సందర్భంగా నరసాపురం మండలం ఎల్బీచర్ల పంచాయతీ బైనపాలెంలో ఆదివారం జరిగిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో మూడు పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వినాయక నిమజ్జనంలో గత రాత్రి బైనపాలెంలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు కానిస్టేబుళ్లకు గాయాలకు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడు పోలీస్ పికెట్‌లు, 12 మంది కానిస్టేబుళ్లను బందోబస్తుకు ఏర్పాటు చేశామన్నారు. రెండు వర్గాలకు వారిపై కేసు నమోదు చేశామని, ఘర్షణలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్సై జి.వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కాళ్ల: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 5 మంది జూదరులను అరెస్టు చేశామని కాళ్ల ఎస్సై సోమవారం తెలిపారు. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుపాడు సంతపేట ఏరియాలో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురి అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.1,950 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఎండకు ఎండి.. వానకు తడిసి

కలెక్టరేట్ వద్ద వాహనాలకు రక్షణ కరువు


భీమవరంలో కలెక్టరేట్ వద్ద షెడ్డు లేక ఎండకు ఎండుతున్న వాహనాలు

భీమవరం: భీమవరం పట్టణం జిల్లాకేంద్రంగా ఏర్పడి రెండేళ్లు గడిచిపోయినా వసతులలేమి వెంటాడుతూనే ఉంది. విశాలమైన భవనంలో కలెక్టరేట్ ఏర్పాటుచేసినా కనీసం వాహనాలకు షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. కలెక్టరేట్‌లోని విధులకు హాజరయ్యే ఉద్యోగులు, సిబ్బందితోపాటు, ప్రతి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చేవారి ప్రజలు వాహనాలు కూడా ఎదురుగా గల ఖాళీస్థలంలో పార్కింగ్ చేస్తుంటారు. అయితే వాహనాల పార్కింగ్‌కు షెడ్‌వంటిది ఏర్పాటుచేయకపోవడంతో మోటారుసైకిళ్లు, కారులు ఎండకు ఎండి వానకు తడవాల్సిందే. ఇటీవల కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు వర్షాకాలంలో భారీవర్షాలు కురవడంతో తమ వాహనాలు పాడైపోతున్నాయని ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ ఎదురుగా గల చెట్లుకింద పార్కింగ్ చేద్దామంటే వర్షాకాలంలో పిడుగులు చెట్లపైపడి వాహనాలు దెబ్బతింటాయనే భయమేస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పంటు రాకపోకల పునరుద్ధరణ

నరసాపురం: వశిష్ట గోదావరి ప్రవాహ ఉధృతి తగ్గడంతో సోమవారం నుంచి పట్టణంలోని గోదావరి పడవల రేవులో పంటు రాకపోకలు పునరుద్ధరించారు. గోదావరి వరద కారణంగా వారం రోజులుగా పంటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి పంటు రాకపోకలు ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం

మొగల్తూరు: నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు ఆసుపత్రి పరిధిలోని 61 అంగన్‌వాడీ కేంద్రాలు, 68 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవ

నరసాపురం రూరల్: పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. మంగళవారం సీతారామపురం సౌత్ గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. గ్రామాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవా

మొగల్తూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంతో భాగంగా నేటి నుంచి అక్టోబర్ 2 వరకు పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీవో వి.బాబ్జీరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 17 మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టబోయే కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ గ్రామంలోనూ స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం, చెత్త చెదారాలను లేకుండా చేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులను, గ్రామస్తులను భాగస్వాములు చేయడం, పారిశుద్ధ్య కార్మికుల సహకారాన్ని గుర్తించడం ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


వరద పోయింది.. బురద మిగిలింది


నరసాపురం: వశిష్ట గోదావరి నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకుంది. స్థానికంగా గోదావరి పూర్తిగా ప్రవాహ వేగం తగ్గింది. గోదావరి శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ పరిధిలో గోదావరి తీరం వెంబడి ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ముంపు పూర్తిగా తగ్గింది. అయితే రేవులన్నీ బురదమయంగా మారాయి. వలంధర్‌రేవు వద్ద భక్తులు స్నానాలు చేయడానికి అనుమతి ఇచ్చారు. కానీ వలంధర్‌రేవు నీరు తొలగడంతో బురదమయంగా మారింది. నిమర్జనం చేసిన వినాయక విగ్రహాలు కూడా అలాగే ఉన్నాయి. అమరేశ్వరఘాట్, లలితాంబ ఘాట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

రేకుల షెడ్డు దగ్ధం

భీమవరం అర్బన్: దిరుసుమర్రు గ్రామంలోని కొత్తపేటలో వృద్ధుడు కొప్పు వెంకట్రావు రేకుల షెడ్డు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వెంకట్రావు సాయంకాలం సమయంలో బయటకు వెళ్లగా ఇంటికి వచ్చేసరికి రేకుల షెడ్డు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే మంచం, ఇతర ఫర్నీచర్లు కాలి బూడిదయ్యాయి. చెరువు లీజు రూ.లక్ష దాచుకున్నానని, అవి కూడా కాలిపోయాయని వృద్ధుడు చెబుతున్నాడు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరగవచ్చని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ముంపు నీటిలోనే ప్రభుత్వ ఆసుపత్రి


ముంపు నీటిలో ఉన్న 104 వాహనాలు


వరి చేలల్లో తూడు, తామర్లు పేరుకుపోతున్న దృశ్యం

ఆకివీడు: ముంపు నీటిలోనే ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం మునుగుతోంది. గత వారం రోజులుగా ముంపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఆసుపత్రి చుట్టూ ముంపు నీరు తిష్ట వేసింది. ఆసుపత్రి ప్రాంగణం నుంచి వెళ్లే పంట బోదె పొంగి ప్రవహించడంతో ముంపునీరు భారీగా చొచ్చుకొచ్చింది. ఆసుపత్రి ఆవరణలో సుమారు మూడడుగుల నీరు నిలబడి ఉండగా గత రెండు రోజుల నుంచి నీరు ఇంకిపోవడంతో ప్రస్తుతం అడుగున్నర లోతు నీరు నిలబడి ఉంది. ఆసుపత్రి ప్రాంగణంలోని పంట కాలువకు రెండు వైపులా మట్టితో కాలువను మూసి వేశారు. చినకాపవరం ముంపు నీరు ఎదురు ప్రవహిస్తూ ఆసుపత్రిలోకి రావడంతో చంద్రబాబు నగర్ వద్ద మట్టి బస్తాలు వేసి పూడ్చి వేశారు. ఆసుపత్రి ఆవరణలోని మురుగు నీరు, ముంపు నీరు రెండూ కలిసిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ముంపు నీటిని బయటకు తోడేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లోనూ, పట్టణంలో వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయని, ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటే ఇక్కడ కూడా దోమల బాధతో వ్యాధులను తీవ్రతరం చేసుకునే పరిస్థితి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో ముంపు నీటిని బయటకు పంపించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముంపు పోయి వ్యర్థాలను మిగిల్చింది

ఆకివీడు: బరువైన గుండెతో బాధపడుతూ, కన్నీళ్లతోనే వరద ముంపు నీటిని బయటకు సాగనంపే పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. వారం రోజుల పాటు గజ గజలాడించిన గంగాదేవి జల విళయతాండవంతో ఉక్కిరి బిక్కిరి చేసి, మెల్ల మెల్లగా సాగుతూ సముద్రుడి చెంతకు చేరుతోంది. వరద నీటి మట్టం తగ్గు ముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటుంటే, అన్నదాతలు కన్నీళ్ళతో కలవరిస్తున్నారు. పంట మునిగి తేలుతుందనే ఆశల్లో ఉన్నారు. మరికొన్ని గ్రామాల్లో ముంపు నీటిలో వరి పంట కుళ్లిపోయిందని రోధిస్తున్నారు. రబీ సాగుకు వరి చేలను తయారు చేయాలంటే ఎకరాకు సుమారు రూ.5 వేల నుంచి 8 వేల వరకూ ఖర్చవుతుందంటున్నారు. ఉపాధి హామీ పనుల్లో వరి పొలాలను శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారంగా రూ.10 వేలు ఇవ్వడం వలన వరి పొలాలను శుభ్రం చేయించడానికే సరిపోతాయంటున్నారు. రబీ సాగుకు పెట్టుబడుల కోసం మళ్లీ అప్పులోళ్ల దగ్గరకు వెళ్లి పుస్తెలు తాకట్టు పెట్టాల్సిందేనా అని వాపోతున్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, పంటల బీమా వర్తింపజేయాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు.